క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్ పెరిక చిట్టి, జిల్లా నాయకులు ఈగల సూర్యభిక్షం, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం ఉచితంగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. హన్మకొండ శరత్ మ్యాక్సీ విజన్ ఆస్పత్రికి చెందిన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పసల మరియదాస్, కార్యదర్శి కందుల సోమయ్య, భిక్షం రెడ్డి, శివకోటి ఆంజనేయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

చిట్యాల : మండలంలోని వనిపాకల గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న ఇరవై మూడు మంది విద్యార్థులకు గుత్తా వెంకట్‌రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దంతూరి సైదులుగౌడ్, సర్పంచ్ మేడి లింగమ్మ నర్సింహ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు కర్నాటి ఉప్పలవెంకట్‌రెడ్డి, రంగా వెంకటేశ్వర్లు, మేడి ఉపేందర్, ఉయ్యాల నరేష్, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా సైదులు

మునుగోడు : మండలంలోని ఇప్పర్తి గ్రామ ఉప సర్పంచ్‌గా ఆడెపు సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత ఉప సర్పంచ్ పుల్కరం సైదులుపై వార్డు సభ్యులు ఇటీవల అవిశ్వాసం పెట్టి పదవి నుంచి తొలగించారు. దీంతో ఎంపీడీఓ జానయ్య సోమవారం నూతన ఉప సర్పంచ్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 8 మంది వార్డు సభ్యులకు ఆరుగురు సభ్యులు హాజరై టీఆర్ఎస్ పార్టీకి చెందిన సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సైదులుకు ఎంపీడీఓ నియామక పత్రం అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రామ సర్పంచ్ బొజ్జ సుజాత, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంలో ఈ నెల 24న ప్రారంభమయ్యే మార్కండేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాలను హైదరాబాద్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోమటి వీరేశం, రావిరాల నగేష్, గంజి వెంకటేశం, ప్రసన్న, చిలుకూరి శ్రీనివాస్, భీమనపల్లి శేఖర్ ఉన్నారు.

బహుమతులు అందజేత

మర్రిగూడ : మండలంలోని సరంపేట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందినవారికి బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. జేకే టీం మొదటి స్థానం, సరంపేట కింగ్స్ రెండో స్థానం, చండూరు కింగ్స్ 3వ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో లెంకలపల్లి ఎంపీటీసీ ఏర్పుల శ్రీశైలం, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు నారగోని యాదగిరియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో చోరీ

చండూరు: చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చోరీ జరిగిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కళాశాల ముగియగానే తాళాలు వేసి అధ్యాపకులు ఇంటికి వెళ్లారు. శని, ఆది వారాలు సెలవు దినాలు కావడంతో సోమవారం అధ్యాపకులు తిరిగి కళాశాలకు వచ్చేసరికి ప్రిన్సిపాల్ గది తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో ఉన్న కంప్యూటర్ కనిపించలేదు. దీంతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్‌కు వినతి

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు అర్హులైన వారినే ఎంపిక చేయాలని కోరతూ సోమవారం ఆ గ్రామానికి వచ్చిన తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నమ్ముల విజయ్‌కుమార్, మాజీ వైఎస్ ఎంపీపీ బండ కిష్టయ్య, దుబ్బ కుమారస్వామి, మారగోని అంజయ్య, బుస్సు మధు, అంబాల ప్రవీణ్, చెరుకు రామలింగం, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

చిట్యాల : నేరడ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. హెచ్ఎం శేఖర్‌రెడ్డి, భిక్షంరెడ్డి, శీనయ్య, రవీన, శ్రీరాములు, మల్లికార్జున్, అఫ్రోజ్‌బేగం, ధర్మందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూర్ : కురుమర్తి హైస్కూల్ విద్యార్థులు సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల హెచ్ఎం రవీందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, సీహెచ్ వెంకట్‌రెడ్డి, కమలజానాయుడు, శ్రీనివాస్, ఎండీ సలీం, కె. కల్పన ఉన్నారు.

చండూరు : మండల కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్ వెంకన్న, ప్రిన్సిపాల్ రామయ్య, ప్రైమరీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, వెంకట్రావు, వినోద్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటికి అల్లాడుతున్న రామగిరి

- అంచనాలో అధికారుల తప్పిదం
- సగం గ్రామానికే వేసిన మిషన్ భగీరథ పైపులైన్లు
- బోరు నీటినే తాగుతున్న ప్రజలు


మిషన్ భగీరథ తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు

శాలిగౌరారం : అధికారుల పొరపాటు.. పాలకుల పట్టించుకోని తీరు కలిసి గ్రామ ప్రజలను తాగునీటి కష్టాలకు గురిచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీటిని అందించి ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతుంటే అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఏడు సంవత్సరాలుగా గుక్కెడు తాగునీటికి నోచుకోక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న రామగిరి గ్రామంలోనే పరిస్థితి ఇలా ఉందంటే ఇక మారుమూల గ్రామాల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఊహించవచ్చు.

250 ఇళ్లకుగాను 150 ఇళ్లకే వేసిన పైపులైన్

శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రామగిరి 2018లో నూతన గ్రామపంచాయతీగా ఆవిర్భవించింది. రామగిరి గ్రామంలో మొత్తం 250 ఇళ్లు ఉన్నాయి. గ్రామ జనాభా సుమారు 1100. అందులో 150 ఇళ్లకు మాత్రమే 2016లో మిషన్ భగీరథ పైపులైన్లు వేసి తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. మిగిలిన 100 ఇళ్లకు నేటికి ప్రధాన పైపులైన్ వేయలేదు. దీంతో ఏడేళ్లుగా ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతూనే ఉన్నారు. మిషన్ భగీరథ తాగునీరు అందకపోవడందతో గ్రామపంచాయతీ బోర్లద్వారా అందే నీటినే ప్రజలు తాగుతున్నారు. బోర్లద్వారా తాగునీరు అందని సమయంలో ప్యూరిఫైడ్ తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నారు.

అధికారుల పొరపాటు..

శాలిగౌరారం ఉమ్మడి గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో 2016లో మిషన్ భగీరథ పైపులైన్ల కోసం సర్వే నిర్వహించి అంచనాలు వేశారు. నాటి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి రామగిరిలో కొంతభాగానికి మాత్రమే పైపులైన్లు వేసేందుకు సర్వే జరిపి మిగిలిన భాగాన్ని వదిలేశారు.

పట్టించుకునేవారే కరువు

ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికి గ్రామంలో మిగిలిపోయిన 100 ఇళ్లకు మాత్రం మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్లు వేయలేదు. తాగునీటి ఇబ్బందులు తీర్చాలని గ్రామ ప్రజలు అధికారులకు అనేకమార్లు విన్నవించారు. అయినా ప్రజల విన్నపాలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. సర్పంచ్ కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించారు. అయినా రామగిరి ప్రజల తాగునీటి సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారిందే తప్ప సమస్య మాత్రం నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్లు వేసి తాగునీటిని అందించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

బోర్ల నీటినే తాగుతున్నాం



గ్రామంలో ముత్యాలమ్మ గుడి దగ్గర నుంచి ఆంజనేయస్వామి గుడి వరకు మిషన్ భగీరథ పైపులైన్లు వేయలేదు. మిషన్‌భగీరథ నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో గ్రామపంచాయతీ బోర్ల నీటినే తాగుతున్నాం. బోర్లనీరు అందని సమయంలో ప్యూరిఫైడ్ నీటిని కొనుగోలు చేసి తాగుతున్నాం.

–నిమ్మల వినోద, రామగిరి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రామగిరి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడక ముందు శాలిగౌరారం గ్రామపంచాయతీలో ఉన్నప్పుడు పైపులైన్ల సర్వేలో అధికారులు పొరపాటు చేశారు. సమస్యను ఇప్పటికే అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లా. త్వరలో పైపులైన్లు వేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

–బండారు శంకర్, సర్పంచ్, రామగిరి

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


కట్టంగూర్ : దుగినవెల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి : పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీలవారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన పలువురు ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలను తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బొప్పారం సర్పంచ్ కర్ర ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలత సురేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో కుంభం శివయ్య, నీలం మల్లయ్య, సైదిరెడ్డి, వీరయ్య, సైదులు ఉన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కట్టంగూర్ : గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం మండలంలోని దుగినవెల్లి, ముత్యాలమ్మగూడెం, తూర్పుబాయిగూడెం, బిల్లంకానిగూడెం, సవ్వళ్లగూడెం, కారింగుగూడెం, మాణిక్యాలమ్మగూడెం, చిన్నపురి గ్రామాల్లో ఎస్‌డీఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.75 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మగూడెంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి బిల్లంకానిగూడెం గ్రామానికి బాట సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరింత వైద్య సేవలు అందించేందుకు రూ.1.50 కోట్లతో భవనం నిర్మించేందుకు త్వరలో శంకుస్థాపన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కొప్పుల ప్రదీప్‌రెడ్డి, పోగుల నర్సింహ, తహసీల్దార్ దేశ్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, ఎంపీటీసీలు మల్లెబోయిన శ్రీలతకృష్ణ, ఎడ్ల పురుషోత్తంరెడ్డి, తవిడబోయిన భవాని, సర్పంచ్‌లు వనం సైదమ్మ దుర్గయ్య, వడ్డె సైదిరెడ్డి, గుర్రం సైదులు, పిన్నపురెడ్డి నర్సిరెడ్డి, చిన్నపాక పరుశురాములు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.60 లక్షల విలువ గల కల్యాణ లక్ష్మి చెక్కులను మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ మురళీమోహన్, ఆర్ఐ తరుణ్, ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, దుబ్బాక శ్రీధర్, బొబ్బలి యాదగిరి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు కంచుకోటగా మార్చిన 'చకిలం'


చకిలం శ్రీనివాసరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ : నల్లగొండ జిల్లాను కాంగ్రెస్‌కు కంచుకోటగా మార్చిన ఘనత చకిలం శ్రీనివాసరావుకే దక్కుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. చకిలం శ్రీనివాసరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డితో కలిసి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చకిలం శ్రీనివాసరావు స్ఫూర్తితో పార్టీ శ్రేణులంతా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేయాలని అన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం జిల్లాలో హాథ్ సే హాథ్ జోడోయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, నల్లగొండ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్, పనస శంకర్‌గౌడ్, కౌన్సిలర్ బొజ్జ శంకర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో చోరీ

కేతేపల్లి: మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో గల బంగారు మైసమ్మ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. ఉప్పలపహాడ్‌లో 65 నంబర్ జాతీయ రహదారి వెంట ఉన్న బంగారు మైసమ్మ ఆలయం ప్రధాన ద్వారానికి ఉన్న తాళాన్ని గుర్తుతెలియని దుండగులు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ గర్భగుడి ముందు ఉన్న హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచి ఉండటం, హుండీ ధ్వంసమై ఉండటంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించిన ఆలయ కమిటీ చైర్మన్ ముదిరెడ్డి యాదగిరిరెడ్డి కేతేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో భక్తులు వేసిన నగదును ప్రతిరోజు సాయంత్రం బయటకు తీస్తామని, చోరీ జరిగిన సమయంలో హుండీలో రూ.500 లోపే నగదు ఉన్నట్లు చైర్మన్ తెలిపారు. దుండగులు చోరీకి పాల్పడిన దృశ్యాలు ఆలయ ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా చోరీ పాల్పడిన ఇద్దరు వ్యక్తులు సూర్యాపేట మండలం ఎండ్లపల్లి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

నేత కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

నల్లగొండ టూటౌన్ : చేనేత కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరికి కూడా ఇవ్వలేదని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని 35వ వార్డులో ప్రజా గోస -బీజేపీ భరోసా సభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.85 కోట్లతో 28 క్లస్టర్లు ఏర్పాటు చేసి కార్మికులకు పని కల్పించే పథకానికి రూపకల్పన చేసిందన్నారు. పేదలకు, రైతులకు ఉచిత వైద్యం, ఫసల్ బీమా సౌకర్యం, కార్మికులకు ఈ శ్రమ్ కార్డు, కార్మిక బీమా సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పార్టీని బూత్ స్థాయిలో పటిష్టపరిచి కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, స్థానిక కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మీవెంకన్న, చేనేత సెల్ రాష్ట్ర కోకన్వీనర్ మిర్యాల వెంకటేశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, కంకణాల నాగిరెడ్డి, బొజ్జ నాగరాజు, దాసరి సాయి, నాగం వర్షిత్‌రెడ్డి, గోవర్ధనాచారి పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

నకిరేకల్ : దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు పాటుపడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, చేపూరి రవీందర్ పిలుపునిచ్చారు. నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ప్రజా గోస- బీజేపీ భరోసా కార్నర్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, మండల అధ్యక్ష కార్యదర్శులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, బుడిగె సైదులు, పసునూరి సైదులు, నాయకులు గుడుగుంట్ల సాయన్న, పల్లపు బుద్ధుడు, గంజి గోవర్ధన్, శివశంకర్, రమేష్, కొండేటి శ్రీను, రవి, మనోహర్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాల నుంచి కార్మికులు పంచాయతీల్లో తక్కువ వేతనంలో సేవలందించారన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎండీ. సలీం, దండెపల్లి సత్తయ్య, ఏర్పుల యాదయ్య, కానుగు లింగస్వామి, దయానంద్, అద్దంకి నర్సింహ, సత్యనారాయణ, భీమగాని గణేశ్, ఎర్ర అరుణ, అంజయ్య, యాదయ్య, సైదాచారి, ముత్యాలు, కృష్ణ, సంజీవ, భద్రయ్య, రాములు, నరసింహ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

చిట్యాల : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలతో నేరాలు అదుపులో ఉంటాయని నార్కట్‌పల్లి సీఐ కె.శివరాంరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లో సీఐగా పనిచేస్తున్న చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన బూరుగు శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శివరాంరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఉన్నా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నకిరేకంటి ధర్మా, ఉప సర్పంచ్ సాగర్ల నరేష్‌యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్రా మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు నర్రా రాములమ్మ, మునుగోటి భాగ్యలక్ష్మీ, సిరిపంగి భాగ్య, నర్రా మాధవరెడ్డి, సిరిపంగి గోపాల్, నర్రా వెంకట్ రెడ్డి, దూదిగామ సత్తయ్య పాల్గొన్నారు.

యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

నల్లగొండ రూరల్ : యువత ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు రూ.50వేల చెక్కు అందజేశారు.

ఆలయానికి విరాళం

శాలిగౌరారం : మండలంలోని భైరవునిబండ గ్రామంలో గల శ్రీగంగాభవాని సమేత ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన కట్ట లక్ష్మి-వెంకట్‌రెడ్డి దంపతులు సోమవారం రూ. 50 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కట్ట లక్ష్మి-వెంకట్‌రెడ్డి దంపతులను సన్మానించారు.

కోమటిరెడ్డిని కలిసిన దైద

నకిరేకల్ : ఏఐసీసీ సభ్యుడిగా నియామకమైన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఆయనకు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నల్లగొండ టౌన్ : పట్టణంలోని పద్మనగర్‌లో నెలకొన్న డ్రెయినేజీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కాలనీవాసులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలపై ఎన్నిమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాలువల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎం.గణేశ్, కె.చంద్రకళ, కృష్ణవేణి, జి.లక్ష్మి, నగేష్, శ్రీనివాస్, సత్యం, లక్ష్మిప్రసన్న , సత్తయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ రాజ్యం నిర్మిస్తాం

నల్లగొండ రూరల్ : ప్రజా సంక్షేమ రాజ్యం నిర్మిస్తామని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని చందనపల్లి ,పెద్ద సూరారం, నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్‌లో స్వరాజ్య పాదయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో డీఎస్పీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్‌మహరాజ్, రవి, దినేష్, శ్రవణ్, శంకర్, రాంబాబు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న విశారదన్ మహరాజ్

బిల్లులు ఇవ్వడం లేదని ఆందోళన


ధర్నా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు

శాలిగౌరారం : మండలంలోని పెర్కకొండారం గ్రామంలో మూడు సంవత్సరాల క్రితం సర్పంచ్ మాచర్ల మైసమ్మ నేతృత్వంలో గ్రామంలోని వీధుల్లో ట్రాక్టర్లతో 509 ట్రిప్పుల మట్టి పోశారు. ఒక్క ట్రిప్పునకు రూ. 250, గ్రామపంచాయతీ పరిధిలోని బచ్చువారిగూడెంలో పోసినందుకు ట్రిప్పునకు రూ. 500లు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అందులో గ్రామంలో 442 ట్రిప్పులు, బచ్చువారిగూడెంలో 67 ట్రిప్పులు పోశారు. అందుకోసం రూ. 1.43 లక్షలు ట్రాక్టర్ల యజమానులకు చెల్లించవలసి ఉంది. పనులు జరిగి మూడు సంవత్సరాలు గడిచినా నేటికీ ట్రాక్టర్ల యజమానులకు డబ్బులు చెల్లించలేదు. అయితే పాలకవర్గం అంతా ఒక్కటై బిల్లులు డ్రా చేశారని ఆరోపిస్తూ ట్రాక్టర్ల యజమానులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయ ప్రధాన గేటుకు తాళం వేసి ఆందోళన నిర్వహించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పెన్షన్లకు దివ్యాంగుల నానాపాట్లు


గ్రీవెన్స్ డేలో దివ్యాంగుడి సమస్య వివరిస్తున్న కుటుంబీకులు

నల్లగొండ : గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు కలెక్టరేట్‌కు దివ్యాంగులు సోమవారం వచ్చారు. వారు నడవలేకపోవడంతో వారి బంధువులు ఎత్తుకొని మీటింగ్ హాల్ వరకు ఎత్తుకొచ్చారు. గాంధీనగర్‌కు చెందిన వేముల వెంకటేశం కాలు వంకరపోయి నడవలేని పరిస్థితిలో సదరంలో దరఖాస్తు చేసుకోగా 24శాతం మాత్రమే సర్టిఫికెట్ వచ్చింది. దీంతో పెన్షన్ రాలేదు. సంవత్సరం క్రితం షుగర్ కారణంగా కాలు మొత్తం తీసేశారు. సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్‌బుక్ చేసుకున్నా పాత సర్టిఫికెట్ చూపుతోంది. దీంతో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మరో ముగ్గురు నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు కూడా వచ్చి పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

ఎంజీయూ అధ్యాపకురాలికి డాక్టరేట్

ఎంజీయూ (నల్లగొండ రూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల విభాగం అదనపు కంట్రోలర్ జి. లక్ష్మీప్రభకి ఉస్మానియా యూనివర్సిటీ సోమవారం డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ కృష్ణమోహన్ నాయుడు పర్యవేక్షణలో పొదుపు సంఘాలు, చిన్న పరిశ్రమల స్థాపన వాటి పనితీరుపై పరిశోధన చేసినందుకు గాను ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అభినందించారు.

యాదయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి


నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు సిరిపురం యాదయ్య కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యాదయ్య 13వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక అమరవీరుల స్తూపం వద్ద యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాల యాదగిరి, వడ్డెబోయిన సైదులు, మామిడి పద్మ, గుండు వెంకటేశ్వర్లు, మునాస ప్రసన్నకుమార్, ఖదీర్, బత్తుల శ్రీనివాస్, బక్కతట్ల వెంకన్న, కంభంపాటి శంకర్‌దుర్గా, చల్లా కోటేష్‌యాదవ్, పున్న వీరేశం, గుర్రం వెంకన్న, శ్రీను, వెంకన్నగౌడ్, నరేష్, ముస్తఫా, అజీజ్ పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీకి నిధులు కేటాయించాలని ధర్నా


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ : ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులు నిలిచిపోయి సంవత్సరం అవుతున్నప్పటికీ నేటికీ నిధులు కేటాయించకుండా సీఎం కేసీఆర్ దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై తీవ్ర వివక్ష చూపుతున్నారని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్‌స్వామి ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌స్వామి మాట్లాడుతూ 10 కిమీ. తవ్వినట్లయితే ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తవుతుందని, ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ సొరంగానికి తక్షణం రూ.1500 కోట్లు కేటాయించాలి. ఈ ధర్నాలో నాయకులు దేవ శ్రీనివాస్‌రెడ్డి, మారగోని శ్రీనివాసగౌడ్, గోపగోని శ్రీనివాసగౌడ్, పోలగోని సైదులుగౌడ్, చేను శ్రీనివాస్ నేత, నకిరెకంటి వెంకన్న, ఇరుగు యాదగిరి, మారగోని సత్యనారాయణ, ఊర వెంకన్న, గుమ్మడెల్లి రామ్మూర్తి పటేల్, ఎండీ. జహంగీర్, ఎస్‌కే. .జానీ, ఎండీ నజీర్ ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

చండూరు : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం చండూరులోని సీపీఐ కార్యాలయంలో సీనియర్ నేత ఉజ్జిని రత్నాకర్‌రావుతో కలిసి నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలోఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో అమరజీవి వైస్ ఎంపీపీ మందడి నరసింహారెడ్డి స్మారక స్థూపాన్ని త్వరలో నిర్మించి భారీ బహిరంగ సభ ఏర్పాటుకు పార్టీ తీర్మానం చేసిందన్నారు. బరిగల వెంకటేష్ అధ్యక్షత వహించిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నలపరాజు రామలింగయ్య, మండల కార్యవర్గ సభ్యులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, టి.రాములు, వెంకన్న, జెల్ల శ్రీను, దోటి వెంకన్న, గంటరమేష్, ఊషయ్య పాల్గొన్నారు

కృష్ణా నీటిలో తెలంగాణ వాటా తేల్చండి

బీజేపీ ప్రభుత్వం కృష్ణానదిలో తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన వాటాను తొక్కి పడుతోందని, తెలంగాణ వాటా తేల్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అనానరు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల ఎసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్ అంజయ్య చారి అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనబోని గాలయ్య, బొలుగురి నరసింహ, టి వెంకటేశ్వర్లు, జి రామచంద్రం , నలపరాజు సతీష్ చాపల శ్రీను, భిక్షంరెడ్డి, శేఖర్‌రెడ్డి, దుబ్బాక భాస్కర్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్ శ్రీ విజయ గణపతి, సరస్వతీ ఆలయంలో మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు సుబ్రమణ్యేశ్వరస్వామి వార్ల త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. మొదటి రోజు గణపతి పూజ, మండపరాధన, కలశ స్థాపన, కుంకుమార్చనలు నిర్వహిస్తారు. రెండో రోజు మూల మంత్ర జపములు, రుద్ర హోమం, రుద్రాభిషేకం నిర్వహిస్తారు. మూడో రోజు రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, నవగ్రహ మూల మంత్ర హోవనము, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగనున్నాయి.

ఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ క్రైం : ట్రాక్టర్‌ను దగ్ధం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కనగల్ మండలంలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య సోమవారం ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది డిసెంబర్ 12న వ్యవసాయ బావి వద్ద ఉన్న తన ట్రాక్టర్‌పై గడ్డి వేసి కొందరు దుండగులు దగ్ధం చేశారని, ఈ విషయమై కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. కేసు నమోదు చేస్తానని చెప్పిన ఎస్ఐ నేటికీ కేసు నమోదు చేయలేదని తెలిపారు. సమగ్ర దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారని బాధితుడు పేర్కొన్నారు.